

అనగనగా ఓ మంచి కథ

# గంజాయి మొక్కలు

## మధురాంతకం రాజారాం

### (1955, ఫిబ్రవరి 27 ప్రజామత వారపత్రిక నుంచి)

"రాఘవయ్య గారిని గురించి నీ అభిప్రాయమేమిటి?" అని నన్నెవరయినా అడిగితే బదులు చెప్పడానికి తగిన మాటలు స్ఫురించక తడబడ్డం నాకలవాటైపోయింది. ఆయన్ని గురించి నాకొక నిశ్చితాభిప్రాయం కుదరలేదనడానికి కూడా వీల్లేదు. ఐతే ఆ నిశ్చితాభిప్రాయమేదో మనసులోనైతే వుందిగానీ మాటలకి మాత్రం అందడం లేదు.

కానీ ఒక్క విషయం మాత్రం నిజం! రాఘవయ్య గారిని గురించి తలచుకున్నప్పుడల్లా వీపున కొరడాపెట్టి చరాలున వాత వేసినట్టు నాకొక విచిత్రానుభూతి కలుగుతూ వుంటుంది.

ఎందుకు కలుగదు! ఆయన్ని గురించి మొదట నేనేర్పరచుకొన్న దురభిప్రాయాలిన్నీ, అన్నీ కావు. పట్టణంలో పదిమంది చేరి జరిపే ప్రతి సాంఘిక కార్యకలాపానికీ మున్ముందుగా రాఘవయ్యగారు హాజరు కావడానికి కారణం పేరు ప్రతిష్ఠల్ని యినుమడింప జేసుకోవాలనీ, స్వాతిశయాన్ని ప్రకటించుకోవాలనీ ఆయనకున్న స్వార్థమేనని భావించాను. ప్రతి శుక్రవారం ఉదయాన కానీలకోసం రాఘవయ్య గారి ఇంటిముందు రెండు మూడు వందల బిచ్చగాళ్ళు మూగి వున్నప్పుడు "ధర్మదాత" బిరుదం కోసం ఆయనెంత సూక్ష్మోపాయం కనిపెట్టేశాడని ఆశ్చర్యపడ్డాను. సుధీగుణాలకు దురితారూఢం చేసుకోవడంలో కూడా ఒక ఆనందం వుంది. రాఘవయ్య గారిని గురించి చేతనైనంత వరకూ దుష్ప్రచారం కొనసాగిస్తూ నేను సరిగ్గా అలాటి ఆనందాన్నే అనుభవించాను.

రాఘవయ్యగారి నిజస్వరూపం నాకు ప్రత్యక్షమయింది పోయిన వేసవిలో. ఏదో పని మీద ముప్పయి మైళ్ళ దూరాన వున్న ఓ గ్రామానికి పోయి రావలసి వచ్చింది. సాయంత్రం ఆరుగంటలప్పుడు బస్సు స్టాండుకు వెళ్ళాను. అప్పటికే ఆకాశాన మేఘాడంబరం జోరుగా వుంది. మార్గమధ్యంలో ఏటి వరదలవల్ల ఎక్కడ ప్రయాణావరోధం తటస్థించుతుందోనని అనుమానిస్తూనే బస్సులో ఎక్కి కూచున్నాను. బస్సు దిగి ఇంటికి వెళ్ళిపోదామని కూడా అనుకున్నాను. అనుకుంటూ వుండగానే బస్సు కదిలింది. కండక్టరు "టిక్కెట్టు తీసుకోండి సార్" అంటూ ముందుకు వచ్చాడు.

బస్సు పట్నం దాటుకుని పోతున్నప్పుడు చూచాను. ఫ్రంటు సీటులో రాఘవయ్యగారు కూచుని వున్నారు, కండక్టరు దగ్గర టికెట్టు తీసుకుంటూ ఆయన వెనుకకు తిరిగి నన్ను చూచి "ఏమండోయ్ మేష్టరు గారూ! ఇలా వచ్చి కూచోండి. ఎందాక వెళ్తున్నారు?" అని ఆహ్వానించారు.

రాఘవయ్యగారి పిలుపు వింటూ నేనొక క్షణంపాటు తెల్లబోయాను, ఎప్పుడో ఒకటి రెండు సమయాల్లో తటస్థించిన స్వల్ప పరిచయం వల్లనే ఆయన నన్ను మరచిపోకుండా గుర్తుంచుకోవడం నాకాశ్చర్యకరంగా తోచింది.

ఫ్రంటు సీటుకు వెనుక వున్న సీటులో రాఘవయ్యగారికి దగ్గరగా కూచుంటూ ఫలానా వూరు వెళ్తున్నానండీ అని చెప్పాను. "అలాగా, నేనూ అక్కడికే వస్తున్నాను" అని ఆయన ఏదో సాహిత్య చర్చ ప్రారంభించారు. నాకు కొంచెం సాహిత్యాభిరుచి కూడా వుందని ఆయన గ్రహించి వుండడం నాకు మరీ ఆశ్చర్యాన్ని కలిగించింది.

పది పదిహేను నిమిషాల తర్వాత ఆయన నన్ను "మేష్టరు గారూ" అనడం మానేసి పేరుపెట్టి సంబోధింప సాగేరు. "స్కూలు ఎలా జరుగుతోంది ? రోలెంత? సగటు హాజరెంత?" అని వాకబు చేశారు. తాలూకా బోర్డు ప్రెసిడెంటుగా వున్న రోజుల్లో తమకు స్కూళ్ళ వ్యవహారాలన్నీ తెలిసి వచ్చాయన్నారు.

చెప్పడం మరిచాను, పట్నంలో బస్సు బయల్దేరింది మొదలు వర్షం మమ్మల్ని వెంటాడసాగింది. తుంపర జల్లై, జల్లు జడివానై, జడివాన కుంభ వర్షమై ఒక ఘడియలో వాతావరణం భయానకంగా మారిపోయింది. బస్సు చుట్టూ కారు చీకటి తెరలు ముసురు కున్నాయి. తలపైన మేఘాలు ఫెళ ఫెళా ఆర్భటిస్తున్నాయి. బస్సుమధ్య వెలుగుతున్న గుడ్డి దీపపు వెలుగులో చుట్టూ వున్నవాళ్ళ ముఖాల్ని పరికించాను. అన్నీ వెలవెల పోయి వున్నాయి.

"ఏమండీ, డ్రయివరు గారూ ! మనం ఈ రాత్రి సురక్షితంగా ఊరు చేరుకోగలమా ?" అని ఎవరో ప్రశ్నించారు.

"డ్రయివరుకు బస్సు నడపడమైతే చేతనౌను గాని. జ్యోతిష్యం చెప్పడం చేతకాదుగా !" అంటూ రాఘవయ్య గారు నవ్వారు.

ఎవరి ఆతురత వారిదని ఊరుకోకుండా నింపాదిగా అలాటి ఛలోక్తిని విసరినందుకు రాఘవయ్య గారిని ఎందరు మనసులో తిట్టుకున్నారో నాకు తెలియదు.

బస్సు హఠాత్తుగా ఆగిపోయింది. డ్రయివరూ, కండక్టరూ ఇక ఆ రాత్రికి బస్సు కదలదన్నారు.

రాఘవయ్య గారు బస్సులోనుంచి దిగబోతూ "ఈ రాత్రికిక మనగతేమిటని ఆలోచిస్తున్నారు కదూ?" అన్నారు నన్ను చూచి.

"అవునండీ! నాకేం దిక్కుతోచడం లేదు" అన్నాను.

రాఘవయ్య గారు నవ్వారు. నవ్వి "ఇవన్నీ జీవితంలో మనం ఎదుర్కోవలసిన చిన్న పరీక్షలండీ! హైస్కూల్లో ప్రతి వారమూ జరుపుతారు చూడండి, ఆ స్లిప్ టెస్టుల లాంటివి! వీటికే బెంబేలు పడిపోతే ఎలా? ఇంకా క్వార్టర్లీ, ఆఫ్ ఇయర్లీ, యాన్యువల్ పరీక్షలున్నాయి. పైగా పబ్లిక్ పరీక్షలు కొన్ని వున్నాయి" అన్నారు.

రాఘవయ్య గారి ధోరణి వల్ల నాకీసారి కోపం కలగక పోయినా చిరాకు కల్గిన మాట మాత్రం వాస్తవం.

ఇక బస్సు కదలదని నిర్ధారణైన తర్వాత వాన కూడా కొంచెం తెరిపి ఇచ్చింది. ప్రయాణీకులందరూ దగ్గర ఏవో పల్లెటూర్లున్నాయని వెళ్ళిపోసాగేరు. వాన మళ్ళీ ఉధృతమయ్యే సూచనలు కనబడుతున్నాయి.

"మనమూ ఒక ఆశ్రయాన్ని చూచుకోడం మంచిది కదండీ" అన్నాను.

"ఆశ్రయానికేం! నాతోరండీ" అంటూ రాఘవయ్య గారు చీకటిని చీల్చుకుంటూ పొలాల్లో పడి నడువసాగేరు.

అంధకారంలో నా మట్టుకు నాకు త్రోవ కనిపించడం లేదు. ఐదారేళ్ళకు ముందే షష్టి పూర్తి చేసుకోవలసిన రాఘవయ్య గారు త్రోవనెలా కనిపెట్టి నడుస్తున్నారో నాకర్థం కాలేదు. పసుపు తోటలకూ వరిపైర్లకూ మధ్య సన్నని గనుమల పైన కాలు జారకుండా నడవడం నాకొక సర్కస్ ఫీటులా తోచింది. రెండు ఫర్లాంగులు ఇలా నడిచిన తర్వాత ఒక చిన్న ఏరు అడ్డం వచ్చింది. దాని గట్టున టెంకాయ తోటలు, వాటికి ప్రక్కన చెఱకు తోటలు గుబురుగా వ్యాపించి వున్నాయి. "ఈ చెఱకు తోటలు దాటుకుంటే చాలు. మనం తల దాచుకోడానికి చోటు దొరుకుతుంది" అన్నారు రాఘవయ్య గారు.

చెఱకు తోటలు దాటుకుని ఒక చెఱువు కట్ట పైకి వచ్చాం. రాఘవయ్య గారక్కడ కొంత సేపు నిలబడి "రామచంద్రం గారూ! ముందుకు చూడండి. నా అంచనా తప్పు గాకపోతే అక్కడ ఒక గ్రామం వుండాలి. గ్రామానికి కొంచెం దూరంగా ఒక గుడి వుండాలి" అన్నారు.

"అవునవును కనబడుతున్నాయండీ ఈ ప్రాంతం మీకు సుపరిచితం అయినట్టుంది" అన్నాను.

అవునని గానీ కాదని గానీ చెప్పకుండా రాఘవయ్య గారు మళ్ళీ నడక సాగించారు.

పది నిమిషాల్లో ఆ గుడి దగ్గరికి చేరుకున్నాం. శిథిలమైపోయిన ప్రాచీన దేవాలయాల్లా గాక ఆ గుడి ఇటీవలనే నిర్మించబడటం చేతనేమో చూపరుల్ని ఇట్టే ఆకర్షించి వేస్తున్నది. "అయ్యయ్యో ! గుడిలో దీపం కూడా వెల్గడం లేదే" అని నొచ్చుకుంటూ రాఘవయ్య గారు లోపలికి వెళ్ళి గర్భగుడికి వెనుకవైపున అంగవస్త్రం పరచి పడుకున్నారు.

"ఊళ్ళోకి వెళ్తే మనకింతకంటే మంచి ఆశ్రయం లభించదటండీ?" అన్నాను.

"లభిస్తుంది. కానీ ఆ ఊళ్ళోకి నేను వెళ్ళడానికి వీల్లేదని ఆంక్ష ఒకటి వున్నది."

"ఆంక్షా? ఎవరు కల్పించిన ఆంక్ష?" రాఘవయ్య గారు మెల్లగా, దీనంగా హృదయవిదారకంగా నవ్వి "భగవంతుడు" అన్నారు. ఆ తరువాత ఆయన మాట్లాడలేదు. నిద్రించారనుకున్నాను.

మళ్ళీ వాన ప్రారంభమైంది. జడివాన చప్పుడు వింటూ పడుకుని నిద్రపోవడానికి ప్రయత్నించాను. కానీ కడుపులో కొక్కులు త్రవ్వుతున్నందు వల్ల ఎంత ప్రయత్నించినా కునుకు పట్టలేదు.

ఆ రాత్రి నాకు నిద్రపట్టక పోవడానికి ఆకలేగాక మరొక కారణం గూడా వుంది. పది, పదకొండు గంటలప్పుడు గర్భగుడి ముందు ఎవరో మాట్లాడుకోవడం వినిపించింది. ఆ తరువాత దీపకాంతి గూడా దృగ్గోచరమైంది. ఆ వేళప్పుడు అక్కడ చేరి మాట్లాడుకోవలసిన అవసరం ఎవరికి కలిగిందో చూద్దామనుకొని కుతూహలం కొద్దీ ఆ వైపుకు వెళ్ళాను.

దీపం చుట్టూ కూచుని నలుగురు వ్యక్తులు చీట్లపేక కలుపుతున్నారు. నన్ను చూడగానే బహుశా నేను పోలీసు వాడిననుకున్నారేమో కంగారు పడి "ఎవరు ? ఇక్కడేం చేస్తున్నావు ?" అని నలుగురూ ఒక్కసారిగా ప్రశ్నించారు. బస్సు ఆగి పోయినందు వల్ల అక్కడ మకాం వేయవలసి వచ్చిందని చెప్పాను. "అలాగా ! ఐతే కూచోండి, మీరూ ఒక చేయి చూస్తారా ?" అని అప్యాయంగా పరామర్శించారు "అబ్బే, నాకంత బాగా రాదండీ ?" అని తప్పుకున్నాను.

అక్కడున్న నలుగురూ తమ ఎదుట నోట్లుగా, నాణ్యాలుగా డబ్బును కుప్ప బోసుకున్నారు. అది డబ్బని నేనైతే అనుకున్నాను గానీ, వాళ్ళు దానికా విలువ ఇస్తున్నట్టు నాకు కనిపించలేదు. నా ప్రక్కన వున్న కోరమీసాల వ్యక్తి వరుసగా పదిసార్లు ఓడిపోయాడు. ప్రతిసారీ ఒక రూపాయి నోటును గెలిచిన వాడివైపుకు ఎడమ చేతితో విసరి పారేశాడు. అతడిని చూచి నేను జాలిపడకుండా వుండలేక పోయాను. ఐతే వున్నట్టుండి అతడి చేతి వాసి మారింది. ఏడెనిమిది ఆటలు వరుసగా గెలిచి "ఇంక కానీండ్రా ! ఈ రోజు మనకు ఆటమళ్ళింది. ప్రతి ఆటకూ ఐదు రూపాయలు మేజు కద్దామా?" అన్నాడు.

కోర మీసాల వ్యక్తి ప్రక్కన మరొక మనిషి కూచొని వున్నాడు. అతడు మొదటినుంచీ ఆటపైన గాక సిగరెట్లు కాల్చడంలో శ్రద్ధ వహించాడు. మూడు ప్యాకీల ప్యాసింగ్ షోలు బూడిదగా మారిపోయాయి. నాలుగో ప్యాకీని తెరవబోతుండగా అతడి ప్రక్కన వున్న స్థూల కాయుడు "ఒరే రామ్మూర్తీ ! నువ్వూ గోపాలమూ ఏదో లోపల్లోపల మాట్లాడుకున్నట్టున్నారు. లేకుంటే ఏడెనిమిది ఆటలు వరుసగా ఎలా కొట్టేస్తాడు ? ఇదిగో అలాటి వెధవ పని చేశావంటే మాటదక్కదు" అని మందలించాడు.

సిగరెట్లు కాలుస్తున్న రామ్మూర్తి "పోరా ఫూల్ ! వాడికి అదృష్టం మళ్ళింది, గెలుస్తున్నాడు. చేతనైతే నువ్వూ గెలువు!" అని గోపాలం పంచిన కాగితాల్ని చేతికి తీసుకున్నాడు.

తరువాత ఆట మరొక వైపుకు మళ్ళింది. వరుసగా నాలుగైదు సార్లు స్థూల కాయుడు గెలిచేశాడు. అతడి ముఖం గాలినిండిన బెలూనులా కలకల లాడింది.

రామ్మూర్తి ఈ సారి వంతు తనకు వచ్చినట్టు స్థూల కాయుణ్ణి చూచి "ఇదిగో, ఇప్పుడు నువ్వు గెలుస్తున్నావు. అట్లా చూస్తే ఆ కిష్టి గాడికీ నీకూ ఏదో లాలూచీ బేరం జరిగినట్టుంది" అన్నాడు.

కిష్టి గాడు రామ్మూర్తిని వురిమి చూస్తూ "అలాటి పని నీకు చెల్లుతుంది. నేను చచ్చినా సరే అలాటి నామర్దాపని చేయను ఈసారి అలా అన్నావంటే పండ్లు రాల్తయ్" అన్నాడు.

"నోరు పారేసుకుంటున్నావురా కిష్టిగా! నేను డొక్క చించి డోలు కుట్టించేశేవాణ్ణి" అని వురిమాడు రామ్మూర్తి.

నోర్ముయ్! చావదన్నేను" అని కిష్టిగాడు వుగ్రుడై పైకి లేచాడు. "లేస్తే ఇక్కడెవరికైనా భయమనుకున్నావట్రా!" అంటూ రామ్మూర్తి కూడా ఎంతకైనా తనూ సంసిద్ధమే నన్నట్టు కిష్టిగాడిపైకి లంఘించాడు.

రామ్మూర్తి కిష్టిగాణ్ణి కొట్టాడు. కిష్టిగాడు రామ్మూర్తిని కొట్టాడు. పరస్పరం తోసుకుంటూ, తిట్టుకుంటూ అక్కడినుంచీ వెళ్ళిపోయారు.

"ఇద్దరూ మంచీ సరదారులే నండీ!" అన్నాను.

"అవును మరి ! ఇద్దరూ ఒక చెట్టు కొమ్మలేగా !" అన్నాడు గోపాలం.

"అంటే ?" అర్థం తెలియక విస్తుపోయాను.

"అన్నదమ్ములు" అని విశదం చేశాడు స్థూల కాయుడు.

వాళ్ళిద్దరినీ గురించి నేను మరెన్నో విషయాలు అడిగి తెలుసుకోవా లనుకున్నాను. కానీ అక్కడ మిగిలిన వాళ్ళిద్దరు కూడా ఆట చాలించి యిళ్ళకు వెళ్ళి పోయినందు వల్ల వాళ్ళను గురించి నేనేమీ తెలుసుకోలేక పోయాను.

రాఘవయ్య గారు ఐదు గంటలకే నన్ను నిద్రనుంచి లేపేశారు. మెల్లగా నడచి రోడ్డు దగ్గరికి వచ్చి ఒక బండ పైన కూచున్నాం. మౌనం వహించిన రాఘవయ్య గారిని మాట్లాడించాలనుకొని "రాత్రి నేనొక అద్భుతమైన సంఘటనని తిలకించానండీ" అన్నాను.

"రాత్రి నేను నిద్రపోయా ననుకున్నారేమో మీరు! లేదు. మేలుకునే రాత్రంతా గడిపేశాను. అక్కడ జరిగిన సంఘటన నాకు కూడా తెలుసు" అన్నారు రాఘవయ్య గారు. రెండు క్షణాల తర్వాత "నాకు తెలిసిందంతే కాదు" అంటూ ప్రారంభించారు. "ఆ ఇద్దరివీ నాకు బాగా తెలుసు. ఆ మాటకు వస్తే నాకంటే వాళ్ళని గురించి తెలిసినవాడు ఈ ప్రపంచంలో లేడు."

"మరికొంచెం వివరంగా చెప్పకూడదటండీ !" అన్నాను.

రాఘవయ్య గారు తలపైకెత్తి నా కళ్ళల్లోకి నిశితంగా చూస్తూ "ఆ యిద్దరూ నా కుమారులేనంటే మీరు నమ్ముతారా ?" అన్నారు.

"ఏమిటీ, ఏమిటీ" అంటూ నివ్వెరపడ్డాను.

"ఇది నా స్వగ్రామం. ఇక్కడే నేను పుట్టి పెరిగాను. ఆ కోవెలని మా నాన్నగారు కట్టించారు. ఆ చెరువు మా తాత ముత్తాతలు త్రవ్వించిందట. అలాటి కుటుంబంలో ఇలాటి వంశోద్ధారకులు పుట్టారు. వీళ్ళ ముఖాలు చూస్తూ ఉండలేకనే నేను పట్నంలో కాపురం పెట్టాను. ఇక్కడున్న ఆస్థిని వీళ్ళకెప్పుడో పంచి పెట్టేశాను. కొంత అమ్మేశారు. మిగిలింది తనఖా పెట్టేశారు. ప్రతిరోజూ కలహాలతో సంసారాన్ని నడివీధిలోకి తెచ్చి నన్నీవైపున తల ఎత్తి తిరుగనీకుండా చేశారు. ఏం చేయమంటారు ? అంతా నా కర్మ" కంఠం గాద్గదికమై పోవడం వల్ల రాఘవయ్య గారు తరువాత మాట్లాడలేకపోయారు.

★★★

.

COMMENTS